పిల్లలు కాన్వెంటుకి వెళ్ళారు. భర్త ఆఫీసుకి వెళ్ళాడు. తిరిగి ఇల్లు కలకల్లాడేది సాయంత్రం అయిదు తర్వాతే. అంతవరకూ పొద్దుపోవడమనేది తనకో పెద్దసమస్య! సాయంత్రం అయిదు మొదలు మర్నాడు ప్రొద్దుట పదిగంటల వరకూ పువ్వుల తోటలా ఉండే ఇల్లు, మళ్ళీ పదింటినుంచి సాయంత్రం దాకా బోసిపోయి, నిర్జీవంగా, కళారహితంగా ఉంటుంది. ఈ ఏడెనిమిది గంటలే తనకి తోచనిదీ, బరువుగా, విసుగ్గా గడిచేదీను.

పోనీ అని అలా ఎవరింటికేనా వెళ్ళి కబుర్లు చెప్పి కాస్సేపు కాలక్షేపం చేసి వద్దాం అంటే, లలితకి అదేం ఇష్టం



# విక్టరీస్టాండ్!

పోల్లాప్రగడ
రాజ్యలక్ష్మి

ఉండదు. అసలు మొదటినుంచీ అలవాటు లేదుకూడా. చిన్నప్పటినుంచీ తన స్వభావమే అంత. అవసరంలేని కబుర్లన్నా అకారణమైన వాదనలూ పట్టుదలలూ అన్నా తనకేవిటో సరిపడదు. కొందరు కావాలని తెగమాట్లాడుతారు. అర్థంలేకుండా వాదిస్తారు. అంతు దేలేదాకా పట్టు పట్టుకుని కూచుంటారు. ఎవరో ఎందుకు తన చిన్నప్పటి క్లాస్‌మేట్ సుజాత అంతే కదా!


సుజాత జ్ఞాపకం రాగానే, లలితకి ఎన్నో పాతవిషయాలూ, క్లాసులోజరిగిన రకరకాలైన సంఘటనలూ ఒకదాని తర్వాత ఒకటి వరసగా జ్ఞాపకం రాసాగాయి. తీరికూచుని అవన్నీ జ్ఞాపకం తెచ్చుకోవడం ఎందుకు? అవేవైనా ఆనందాన్ని ఇచ్చేవా, ఆహ్లాదాన్ని కలిగించేవా? పోనిద్దూ.

ఇలా అనుకొని లలిత టీపాయ్ మీద పత్రికలు తీసి ఒక్కటొక్కటే తిరగేయ సాగింది. ఏ కథ చూద్దాం అన్నా ప్రతీదీ సామాన్యంగా సరళ రేఖలా సాఫీగా సాగిపోతూన్నదే! దేంట్లోనూ ఉత్కంఠ కలిగించే సన్నివేశం కానీ హృదయాన్ని ఆకట్టుకొనే భావావేశం కానీ ఆమెకి కనిపించలేదు. ఇది కాదని సీరియల్స్, తిరగేసింది. అవీ అంతే – ఏవో కాలేరు చేంతాళ్ళలాగ అల్లుకుపోయినవేగాని, ఒక్క దాంట్లోనూ అర్థం పర్థం కాని, అవసరం ఔచిత్యం కాని ఉన్నట్లు తోచ లేదు. కాని ఏం చేస్తుంది? అవే చదవాలి. అంతకన్నా కాలక్షేపానికి మార్గంలేదు.

పాత సంచికలో సీరియల్ ఎక్కడ ఆగిందో కాని, ఈ సంచిక మొదట్లోనే, కథానాయిక అత్తారింటికి తీసుకువచ్చిన 'సారె'ని వర్ణించడంతో కథ మొదలైంది. ఆ వర్ణన అలా అలా రెండు మూడు పేజీల దాకా సాగుతూనే ఉంది. ఆ వర్ణన చదివి చదివి ఇంక విసుగొచ్చి, పత్రిక విసిరి టీపాయ్ మీద పడేసి వచ్చి మంచం మీద పడుకొంది లలిత.

కథలో అమ్మాయి అంత సారెపట్టు కొచ్చింది కదా, తనేం పట్టుకొచ్చింది అత్తారింటికి? చిన్నప్పటి నుంచీ అమ్మ నేర్పిన వినయం, వివేకం, సాధుశీలం, సౌజన్యం, ఇవే కదా?" నాకేం కట్నాలూ లాంఛనాలూ అక్కర్లేదు. ఒప్పయిన పిల్ల ఓర్పుగా ఉంటూ నా మనస్సులో మనస్సుగా కలిసి పోగలిగితే చాలు'' అని ఆయన ఉదారంగా ప్రవర్తించి తనని చేసుకోవడం వల్లే కదా తనకీ నాడు ఈ అదృష్టం లభించింది! లేకపోతే తన అంతస్థు ఎక్కడ ఆయన అంతస్థు ఎక్కడ? లలితకి ఒక్కమారుగా భర్తపట్ల ఎక్కడ లేని కృతజ్ఞతా తలఎత్తింది.

వెంటనే లేచి వెళ్ళి అలమర్లో ఉన్న ఆల్బమ్ పట్టుకొచ్చి ఒళ్లో పెట్టుకొని మొదటి పుటలోనే నవ్వుతూ ఠీవిగా నుంచున్న భర్త ఫొటోకేసి రెప్ప వెయ్యకుండా చూస్తూ కూర్చుంది. పక్కనే సిగ్గుల మొగ్గలా ముడుచుకొని పోయి బరువైన కనురెప్పలతో చూస్తున్న తన ఫొటో–ఆ రెండు ఫొటోలూ చూసే సరికి అప్పుడే పెళ్ళయినట్లు సిగ్గుతో పులకరించిపోయింది లలిత. పేజీతిప్పింది ఊగే గుర్రం మీద కూర్చున్న బాబు,



యాపిల్ పండు చేత్తో పట్టుకొని నిలబడ్డ పాప – తన కంటి పాపలూ, తన జీవన జ్యోతులూ వాళ్ళిద్దరూ.

ఈ జన్మకీ అదృష్టం చాలు !

తృప్తిగా నిట్టూర్చి గుండెల నిండా గాలి పీల్చుకుంది లలిత.

ఆల్బమ్ పేజీలు తిప్పింది.... చుట్టాలవీ, స్నేహితులవీ, ఆయనవీ, తనవీ, పిల్లలవీ రకరకాల సందర్భాలని గుర్తు చేసే ఫొటోలు. కొన్ని ప్రకృతిదృశ్యాలు కొన్ని ఆయన ఆఫీసుకి సంబంధించిన వాళ్ళవి – కొన్ని తన చిన్నప్పటివీను. కాలేజీలో చదువు పూర్తిచేసుకొని అందరూ విడిపోయే రోజున తీయించుకొన్న గ్రూప్ ఫొటో అది. వచ్చివచ్చి లలిత చూపులు ఆ ఫొటో దగ్గర ఆగిపోయాయి. ఆలోచనలుమాత్రం వెనక్కి కాలేజీలో చదువుకొన్న రోజుల దగ్గరకు వెళ్ళిపోయాయి.

ఈ పద్మజ భలే చలాకీగా ఉండేది. ఇప్పుడు ఎక్కడుందో - సునీత ఎప్పుడూ మగవాళ్ళని తిడుతూ ఉండేది. మరిప్పుడు పెళ్ళి చేసుకుందో, అలాగే పోయిందో–సుకుమారి అతుకుల కట్టుకుని పాపం ఎవరి కంటా పడ ఓ మూల కూర్చునేది, ఆమధ్య ఎ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది ఉందో–ఇదెవరు ? సరోజ కదూ? వాళ్ళ నాన్నగారి కారులో వచ్చేది. యాలో ఉందో ఇప్పుడు ఫారిన్ వె వాణీ, రాణీ వీళ్ళిద్దరూ ఎప్పుడూ తిరిగే వారు కదూ ? ఇప్పుడేం న్నారో !....

సుజాత !

లలిత ఒక్కసారిగా ఉలిక్కి క్లాసులో అందరం ఒక తల్లి బిడ్డ పొరపొచ్చలూ లేకుండా ఉండే ఈ సుజాత తోటే ఘర్షణ వచ్చేది రికి. సుజాత తగువు పెట్టుకోంది క్లాసులో ఎప్పుడూ ఎవరితోటో తోటి ఏదో ఒక కజ్జా పెట్టుకు ఉండేది. తనతో మరీను. తను సర్దుకు పోతూన్నా ఎందుకో ఒ దెబ్బలాడేది. ఎప్పుడూ రుసరుస ల

ముందు వెనకా ఆలోచించ కుండా మాటలు విసిరేస్తూ, అందరి కంటే తను అధికురాలిగా, చుట్టూ ఉన్న వాళ్ళంతా తనకి అన్యాయం చెయ్యాలని ప్రయత్నిస్తున్నట్లు, పోట్లాడి తనని తాను రక్షించుకోవాలన్నట్లూ, అనుక్షణం అసహనంతోనూ కోపంతోనూ, ఊగిపోతూ ఉండేది.

అసలు మొదటి నుంచీ సుజాత అంతే!

కాలేజీలో చేరిన కొత్తలో ఆరోజున, జ్ఞానాంబ టీచరు తెలుగుపాఠం చెబుతూన్నప్పుడు, క్లాసుకి లేటుగా వచ్చి, టీచరు లోపలికి రమ్మని అనలేదని పౌరుషం వచ్చి గుమ్మం దగ్గర నిలబడి ఎంత హడావిడి చేసింది! ఒకటి రెండు సార్లు కంఠం సవరించుకొని, కావాలని చెప్పులు చప్పుడుచేసి, మో చెయ్యి తలుపుకి తగిలించి నానా హంగామా చేసింది కదూ? జ్ఞానాంబ టీచరు గమనించీ గమనించనట్లు ఊరుకొని చివరికి "ప్రిన్సిపాల్ దగ్గర్నుంచి పెర్మిషన్ తీసుకురా" అంటే కాళ్లు విదిలించుకుంటూ ఎలా వెళ్ళిపోయింది! ఆ రోజు ఫస్ట్ పీరియడ్‌కి ఇంక రాలేదుగా? పట్టుదలకోసం ఎదురుగుండాగా డ్రైన్‌లో చెట్టు మొదట్లో కూర్చుని "ఆఁ!.... తెలుగుపాఠం కూడా వినాలేమిటి?" అన్నట్లు ఫోజుపెడుతూ, ఏదో నవల తీసుకుని చదువుతూ కాలక్షేపం చెయ్యలేదూ?

సెకండ్ పీరియడ్‌లో వచ్చిమాత్రం ఏం చేసింది? "జరుగు" అంటూ అబద్ధస్తిగా తనని తోసేసి ఫస్ట్ బెంచీలో తన పక్కని కూర్చుంది. 'సర్లే' అని తనేదో సర్దుకుని కూర్చో బోతూంటే. ఇంకా చోటంతా ఆక్రమించి తనని పూర్తిగా అక్కడ నుంచి తోసేసేలా తయారయింది. పైగా "ఏవిటే సుజాతా ఆ అన్యాయం! లలితని అలా తోసేస్తావేమిట"ని ఎవరో అడిగి నందుకు వాళ్ళమీద విరుచుకు పడింది. నలుగురైదుగురు ఫ్రెండ్స్ తన తరపున మాట్లాడినందుకు ఆ కోపం అంతా తనమీద చూపిస్తూ" అంతా కాలేజీలకి వచ్చి ఫ్రంట్ బెంచీలు ఆక్రమించుకొని కూర్చుంటే అయిందా? క్లాసులు అర్థం కావాలి.

పరీక్షలు ఫస్ట్‌గా రాయగలగాలి అంటూ వ్యంగ్యంగా మాటల్ని ఈటెలులాగ వదలడం మొదలు పెట్టింది." ఊరుకుంటావేమే లలితా" అని అందరూ తనని హెచ్చరించారు. తనే ఎందుకొచ్చిన గొడవ పోనిద్దూ అని ఊరుకొంది. లేక పోతే ఆరోజున పెద్ద పోట్లాటే జరిగేది.


ఆ రోజునుంచీ, ఎందుకో తెలియదు, తనంటే సుజాత ఈసడించు కుంటూనే అంది. అవకాశం వచ్చినప్పుడు అవమాన పరుస్తోంది. బద్ధ శత్రువులాగ చూస్తూ విరోధాన్ని పాటిస్తూనే ఉంది, తర్వాత ఓ రోజు హిస్టరీ లెక్చెరర్ పాఠం చెప్పి చెప్పి చివరికి, చెప్తూన్నది ఊరికే కళ్ళప్పగించి వినడమేనా లేక ఏమైనా అర్థం అవుతోందా? ప్రశ్న అడిగితే ఎవరేనా చెప్తారా?" అన్నారు, వెంటనే సుజాత లేచి నేను చెప్తాను సార్ అనడమేకాదు. ధైర్యంగా ప్రశ్నకి సమాధానం కూడా

చెప్పింది. తర్వాత ఆయన మరో ప్రశ్న తనని అడిగారు. తను తబ్బిబ్బు పడి "నోటితో సమాధానం చెప్ప లేనండి. కాగితం మీద రాయమంటే రాస్తాను" అంది. వెంటనే సుజాత అవ హేళనగా నవ్వింది. ఆ నవ్వులో లెక్చరర్ గారికి ఏం అర్థం అయిందో ఏమో," నువ్వు చెప్పనూఅక్కర్లేదు రాయనూ అక్కర్లేదు కూచో" అన్నాడు వ్యంగంగా తనకి తల కొట్టేసినట్లయింది అది అయిన తర్వాత నాలుగైదు రోజుల దాకా అవమానంతో తన మనస్సు మండి పోతూనే ఉంది. కావాలని అలా నవ్వి లెక్చరర్ గారి చేత తనని అవహేళన పరచక పోతే యేం? సుజాతకి ఎందుకు తన మీద ఎందుకు ఈ అకారణ ద్వేషం? ఎంత కోపం వచ్చినా తను ఒకరిని మాట అనదే, ఒకరి మనస్సుని నొప్పించదే! అలాంటిది ఈ సుజాత ఎందుకు అకారణంగా తనని అస్తమానూ అవమాన పరుస్తుంది?

ఇంతలోపోస్ట్మాన్ కేకవినిపించింది. ఆ ఆలోచనల్ని అంతటితో కట్టిపెట్టి వెళ్ళి టపా తీసుకుంది. లలిత, ఆయన కెవరో మిత్రులు రాసిన ఉత్తరాలు రెండు. ఒక మనిఆర్డరు రశీదు. బుక్ పోస్టులో వచ్చిన ఓ చిన్న జర్నల్. అయిదోది శుభలేఖ. ఎక్కడ నుంచి చెప్మా అని చూసింది" సునీత వ్రాయు ఆహ్వానము. నా పెళ్ళి— " అరే చిత్రంగా కొత్తగా ఉందే భాష. సాంప్రదాయం పదతిలో లేదు పైగా తనపెళ్ళికి తన పేరనే ఆహ్వానం పంపిస్తోంది. ఎవరీ సునీత! వెనక్కి తిప్పింది. అరే– ఇది ఇంకా ఆశ్చర్యం. ఈ ఆహ్వానం ఆయనకి వచ్చిందికాదు. ఆయన కేరాఫ్ తనకి వచ్చింది. తనకి తెలిసిన వాళ్ళల్లో ఇంకా పెళ్లి కావలసిన సునీత ఎవరు? తన క్లాస్మేట్ సునీత కాదుకదా !....

దాంతో లలితకి మళ్ళీ కాలేజీలో చదువుకొనే రోజులు గుర్తుకొచ్చాయి. ఒక రోజు కాలేజీలో వ్యక్తృత్వ పు పోటీలు జరిగాయి. స్త్రీ స్వాతంత్ర్యము అనేది చర్చనీయాంశము. తనేమో స్వాతంత్ర్యంతోబాటు బాధ్యతలగురించి కూడా చెప్పి ఓ మోస్తరుగా ఉపన్యాసం చెప్పి కూర్చుంది.సునీత చాలా చక్కగా మాట్లాడింది. చట్టాలూ, సంఘం, ఆచారాలూ ఇవన్నీ పురుషుడిచేతిలో ఉండడం వల్ల స్వార్థంతోటిఅహంకారంతోటిఅతను ఆడదాని స్వాతంత్ర్యాన్ని పరిమితం చేశాడు కాని లేక పోతే పరిస్థితులు ఇలా ఉండేవి కావంటూ మధ్య మధ్య పురుషుల మీద చెణుకులు విసురుతూ చక్కని ఉపన్యాసం ఇచ్చింది. సుజాత మాత్రం ప్రారంభించిన లగాయితూ పూర్తి అయేదాకా తను ఇచ్చిన ఉపన్యాసాన్ని ఖండిస్తూనే మాట్లాడింది. తానె కొత్త పాయింట్లేం చెప్పలేదు. ఎంత సేపటికి "కొంద రిలా అనుకొంటారు. అది తప్పు – ఇది తెలివి తక్కువ అభిప్రాయం. ఇలా చెప్పడం వల్ల వారి అజ్ఞానం బయటపడుతుంది, ఈ రకంగా సాగింది ఆమె ఉపన్యాసం.

ఆఖర్ని బహుమతులు నిర్ణయించే సమయానికి జడ్జీలు సునీతకి ఫస్టుప్రైజూ తనకి సెకండ్ ప్రైజూ ప్రకటించారు. అప్పుడు సుజాత ఎంత అల్లరి చేసిందనీ!




ఈ నిర్ణయం అన్యాయం అని అరిచింది. ఏ పరిస్థితిలోనూ సునీతకి ఫస్టు ప్రైజు రాకూడదని వాదించింది. లలితకి సెకండ్ ప్రైజు ఏమిటంది? జడ్జెస్ పక్షపాతంతో వ్యవహరించారంది. కావలిస్తే పోటీ మళ్ళీ పెట్టమంది. అంతా సుజాతని అసహ్యించుకున్నారు. ఎవరెంత చెప్పినా మానదే! జడ్జీలు నిస్సహాయ స్థితిలో పడిపోయారు. ఇలా వివాదానికి కారణమైన ప్రైజు తీసుకోవడం ఇష్టంలేక "నాకా సెకండ్ ప్రైజు అక్కర్లేదు. అది సుజాతకి ఇవ్వండ''ని తను అంటే, "చూశారా, అన్యాయంగా ప్రైజు తీసుకోబోయింది కనకే నేను వాదించేసరికి భయపడి ఆ ప్రైజుని వదులుకుంటోంది. తీర్పులో పక్షపాతం ఉందని చెప్పడానికి నిదర్శనం ఇంకేం కావాలని పెద అల్లరి చేసింది. దాంతో అందరికీ అసహ్యం వేసింది. విసుగొచ్చి తనతోపాటు సునీతకూడా తనకా ప్రైజు అక్కర్లేదులెండి అంది జడ్జీలతో— తక్కిన స్టూడెంట్స్ అందరికీ సుజాత పట్ల పట్టలేని కోపం వచ్చి "ఊ రెండు ప్రైజులూ నెత్తినెట్టుకుని ఊరేగు" అన్నారు. "ఆ.... ఊరేగుతాను.... ఏం?" అంటూ అందరినీ ముదలకించి, తలబిరుసుతో దర్జాగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

అబ్బబ్బ! సుజాత ఈ మాట అంటుంది. ఆ మాట అనదు అని లేదు. నోటికి ఏం వస్తే అది, ఎలా వస్తే అలాగ మాట్లాడేసేది. దళసరిగుడ్డలుకట్టుకుంటే "అవును మరి వాళ్ళ నాన్నపోస్టు మాస్టరు టపాసంచులు ఊరికే వచ్చాయని కుట్టించాడు" అని నవ్వేది. కొంచెంపల్చనివి వేసుకుంటే "కొందరికి సిగ్గు ఎలా ఉండదో ఒళ్లు కనిపించేలాంటి బట్టలు కట్టుకుంటారు. అలాంటి చీరలు కట్టుకుని మగాళ్ళని వల్లో వేసుకోగలమని ఆశ కాబోలు పాపం!" అనేది వ్యంగ్యంగా. తనకి కళ్లనీళ్ల పర్యంతం అయేది. ఒక్కమారుగా వెళ్లి చెంప పగలగొడదాం అనిపించేది. ఏమిటింత పొగరు!

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది. లేచి

వెళ్లి రిసీవ్ చేసుకుంది లలిత. ఆఫీసు నుంచి కాబోలు ఆయన మాట్లాడుతున్నారు. ఇవాళ కొత్త పిక్చర్ విడుదలెందిట. టిక్కెట్లు రిజర్వు చేశారుట. తను ఆఫీసు నుంచి వచ్చేటప్పటికి, పనులు పూర్తి చేసుకుని పిల్లల్ని కూడా రెడీ చేసి పది నిముషాల్లో బయలుదేరడానికి సిద్ధంగా ఉండాలట! ఆయన హంగామా హడావిడీ వినేసరికి లలితకి నవ్వు వచ్చింది. టైము చూస్తే ఇంకా పన్నెండు దాటలేదు. అబ్బ - అయిదు గంటల తర్వాత మాట కదా అని ఓ మారు ఒళ్ళు విరుచుకొంటి ఈజీ ఛైర్‌లో కూర్చుంది.

సీరియల్ కథ లాగ సుజాత తాలూకు ఆలోచనలు మళ్ళీ ప్రారంభం అయ్యాయి. సుజాత ఎప్పుడు సౌమ్యంగా, సజావుగా ఉంది కనక? 'కాలేజీ డే' నాడు ఆటల పోటీలో తనకి ఫస్టు ప్రయిజు వచ్చినందుకు పెద్ద జాతర చేసేయ్యలేదూ? కాలేజీ కాలేజీ అంతా, ఆ రోజు 'రన్నింగ్ రేస్'లో ఎవరు ఫస్టు వస్తారా అని వెయ్యి కళ్ళతో బారులు తీర్చి ఇటూ అటూ నిలబడి ఉండగా, స్టార్టింగ్ పాయింట్ దగ్గర ముగ్గు గీత మీద, తనతో కలిసి పది పదకొండుగురు గరల్స్ అయితే రెడీగా నిలబడి ఉన్నారు. వాళ్ళలో సుజాత కూడా ఉంది. పిజికల్ డెరెక్ట్రిస్ రూతమ్మగారు ఎప్పుడు విజిల్ వేస్తారా ఎప్పుడు బయలేరుదామా అని పరుగుడు పందెంలో పోటీ చేస్తూన్న వాళ్ళంతా ఎంతో నెర్వస్‌గా ఫీలవుతూ వేచి ఉన్నారు.

పక్కనే ఉన్న రూతమ్మ "నేను విజిల్ ఊదగానే మీరు పరిగెట్టడం ప్రారంభించాలి. గీతకి ఇంకా వెనక్కి నుంచోండి. అదిగో ఎదురుగుండా ఏభై గజాల దూరంలో ముగ్గు గీత మీద ఉన్న జండా స్థంభాన్ని ఎవరు ముందు తాకితే వాళ్ళు ఫస్టు - ఏం అంతా రెడీయేనా?" అంది. అంతా తెలుసులే. ముందు విజిల్ వెయ్యి' అన్నట్లు చూశారు అంతా. సెకన్లు గడుస్తున్నాయి. అందరూ నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నారు.

విజల్ వినిపించింది.

అంతే!....తనకింక వళ్ళు తెలియలేదు. తను పరిగెడుతోందో లేక గాలిలో తేలి పోతోందో....దృష్టిలో జండా స్థంభం తప్ప ఇంకేం లేదు. వెనుక నుంచీ పక్కనుంచీ, అరుపులు, కేకలు,చప్పట్లు, హెచ్చరికలు-లలితా గెట్ ఎలాంగ్ అని కొందరుసుజాతా కీప్ అప్ అనికొందరు, ఇంకా తక్కిన పోటీ దార్లని హెచ్చరిస్తూ మరి కొందరు. వాతావరణంఅంతా ఎంతో ఉద్రిక్తతగా ఉంది.


స్తంభం ఇంకొక్క అయిదు గజాల దూరంలో మాత్రం ఉంది. అందరి కంటే తనే ముందుంది. కాని తన పక్కనే సుజాత కూడా వస్తుంది. శరీరంలో సర్వశక్తుల్నీ కూడదీసుకుని పక్కలూ నరాలూ మెలిపెట్టేస్తూన్నా లెక్కచెయ్యకుండా ఒక్కమారుగా ఉరికింది. చెయ్యి జెండా స్థంభానికి తగిలింది. వెంటనే సుజాత చెయ్యి కూడా స్తంభం మీద పడింది.

"లలితా ఫస్ట్"అంటూ ఒక్కమారుగా కొన్ని వందల కంఠాలు అరిచాయి.అంతే

ఆ తర్వాత ఏం అయిందో తనకి తెలియదు. ఊపిరి ఆగి పోతుందేమో అన్నంత ఆయాసం, కళ్లు తిరిగిపోయి, చెవులు గళ్లడిపోయి అక్కడే కూలబడిపోయింది. దాదాపు రెండు మూడు నిముషాల తర్వాతగాని తనకి ప్రపంచం తెలియలేదు. ఎవరో అందించిన నిమ్మకాయ బద్ద చప్పరిస్తూ అతి కష్టం మీద లేచి నాలుగడుగులు వేసేటప్పటికి దెబ్బై ఎనభై మంది అమ్మాయిలు గుమిగూడి ఉన్నారు. వాళ్ళ మధ్య రూతమ్మగారితో వాదిస్తోంది సుజాత.

"నేనే ఫస్టు – మొదట. తైనుమీదకి నేనే వెళ్లాను. స్తంభం మీద చెయ్యి వెయ్యడం ముఖ్యం కాదు, ఫస్టు ప్రైజు నాకే ఇవ్వాలి." సుజాత మాట్లాడ్డం లేదు, అరుస్తోంది. రూతమ్మగారు నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తుంది. చుట్టూ ఉన్న అమ్మాయిలు" మేం చూశాం. లలిత ఫస్టు "అంటూ కేక లేస్తున్నారు. లేదు – మీరేం చూశారు? ముగ్గు గీత మొదట నేనే తొక్కాను" గట్టిగా అరుస్తూ వాదిస్తుంది సుజాత. తను ఆ జనం లోంచి చోటుచేసుకుని నెమ్మదిగా మధ్యకి వెళ్ళింది.

"కావలిస్తే మళ్ళీ పెట్టండి మా ఇద్దరికీ పోటీ" అంది సుజాత. రూతమ్మగారు ఏం చెప్పాలో అర్థం కాక నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. ఆ సమయంలో తను నెమ్మదిగా "పోనీ తగాదా ఎందుకు? ఆమెకే ఫస్టుప్రైజు ఇవ్వండి. నేను సెకండు ప్రైజు తీసుకుంటాను" అంది. అంతా "అదేమిటి లలితా" అంటూ అరిచారు. మరీ సన్నిహితులైన




శ్రీపాపళ్ళ 'మామూలు' !

వాళ్లు వీల్లేదు అన్నారు. విక్టరీ స్టాండ్ మీద సుజాత మొదటి స్థానంలోనూ, తను రెండో స్థానంలోనూ నిలబడ్డప్పుడు ఎవరూ చప్పట్లు కొట్టలేదు. కొందరు సుజాతని గేలిచేస్తూ నవ్వారు కొందరు, తనని చివాట్లు పెడుతూ "ఏవిటే అర్థంలేని త్యాగం? నువ్వు ఎందుకు ఒప్పుకున్నావు" అన్నారు. "పోనీ లెండర్రా ఈ పందేల్లో నెగ్గినా నెగ్గకపోయినా ఒకటే. జీవితం అనే 'విక్టరీ స్టాండ్'లో ప్రథమ స్థానం సంపాదించాలి. ఏమంటాను?" అంటూ తను జోక్‌గా తీసిపారేసింది. ఆ రోజు రూతమ్మగారు తనని పక్కకి పిలిచి" లలితా నువ్వు మంచిపని చేశావు. కొన్నిచోట్ల అసమర్థత అహంకారంగా మారినప్పుడు ఆ అహంకారంజోలికి మనం పోకూడదు, పోతే మనది అజ్ఞానం అవుతుంది,"

అన్నారు. నిజమే. తను ఆ జోలికి పోకుండా దూరంగాఉంది. స్నేహితులమూ సంబంధం లేనివాళ్ళమూ కనుక ఇలా తప్పుకుంటాం, తప్పించుకొని తిరుగుతాం. కాని ఇంత క్రౌర్యం, కాఠిన్యం, అసహనం ఉన్న వ్యక్తితో. రేప్పొద్దున పెళ్ళయాక మొగుడెలా వేగుతాడు. పిల్లలెలా బతుకుతారు? వాళ్ళు తమలాగ తప్పించుకొని ఉండలేరుగా?

ఇలా ఆలోచిస్తున్న లలితకి మాగన్నుగా నిద్రపట్టింది. నిద్రలో తనేదో ముళ్ళూ రాళ్ళూ ఉన్న దార్లో పడుతూ లేస్తూ తూలిపోతూ సోలిపోతూ నడుస్తోంది. ఎదురుగుండా దూరాన కొండమీద 'విక్టరీస్టాండ్' తెల్లగా మెరిసిపోతూ కనిపిస్తోంది. తను నడుస్తూనే ఉంది.... విక్టరీస్టాండ్ వేపు....విజయసౌధంలా నిలబడ్డ ఎత్తైన ఆ తెల్లని పర్వతంవైపు.

పక్కింట్లోంచి గట్టిగా మాటలు వినిపించేసరికి లలితకి నిదట్లోంచి మెలకువ వచ్చింది. ఎవరిదో కంఠస్వరం బిగరగానే వినిపిస్తోంది. "నాకేం భయంలేదు పిన్నీ! నన్నూ నా పిల్లనీ పోషించుకోలేకపోను. ఆ మొగుడితో మాత్రం ఛస్తే కాపురం చెయ్యను. వదిలేశానంటే వదిలెయ్యడమే.... ఇంకా నిర్ణయానికి తిరుగులేదు. ఎందుకు అనుమానం? నాకీ ఉద్యోగం తప్పకుండా వస్తుంది. వారం పదిరోజుల్లో నాకు ఆర్డరు వస్తుంది. నేను వచ్చి ఉద్యోగంలో జాయిన్ అవుతానుగా? మరి వెళ్ళివస్తా...." కటువుగా వున్న ఆ కంఠం వినేసరికి లలితకి ఎక్కడ నిద్రమత్తు అక్కడ వదిలిపోయింది. గబగబా వీధిగేటుదగ్గరకి వచ్చి చూసింది. అప్పుడే వీధిమొగ తిరుగుతున్న చీర చెంగు కనిపించింది. లలిత ముఖం ఇటు తిప్పి చూసింది. పక్కింటి పిన్నిగారు వాళ్ళ వాకిట్లోనుంచి నిట్టూర్చి "ఇది మొగుణ్ణి అయినా వదిలేసింది కాని అహంకారాన్ని వదలలేదు" అంటూ లోపలికి వెళ్ళి గేటు వేసుకోబోతున్నారు. "ఎవరండీ పిన్నిగారూ!" అంది లలిత.

"సుజాత అనీ, మా చుట్టాల అమ్మాయి అమ్మా! ఇవాళేదో ఇక్కడ ఉద్యోనికి ఇంటర్వ్యూ ఉంటేనూ వచ్చి వెళుతోంది" లలిత అదిరిపడింది! విక్టరీస్టాండ్ మందహాసం చేసినట్లనిపించి, "అయ్యో పాపం సుజాత!" అంటూ సానుభూతితో నిట్టూర్చింది.

---

ఒకడు: ఒరేయ్! నువ్వూ నేనూ పరీక్షలలో ఒకే గైడునుచూచి వ్రాశాం గదా! మరి నీవు పాసై, నేను ఎందుకు ఫెయిలైనాను?

రెండవవాడు: నీవేవో జవాబులు గైడులో చూసి రాశావు. మరి నేనేవో అచ్చుతప్పులుపోతాయని గైడు పేరు, పేజీ నెంబరు వ్రాశాను, పరీక్ష పేపరు దిద్దేవానికి కష్టం ఉండదని!

కోదాటి నాగకుమార్
కోదాడు.